# నచోరహార్యం...




"గురుబ్రహ్మః గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వర।
గురుస్సాక్షాత్ పరబ్రహ్మః తస్మైశ్రీ గురవే నమః॥"

వేగంగా వల్లిస్తున్నాయి రవి పెదాలు. అవును మరి, తెల్లవారితే పరీక్ష. అందులోనూ టెన్త్ పబ్లిక్ పరీక్ష. సంస్కృతం మీద ఉన్న గౌరవ మర్యాదలకు చిహ్నంగా తల్లి రవి సంస్కృతం ఆప్షనల్ తీసుకునేలా చేసింది. రవికి ఆ సబ్జక్ట్ అన్నా అందులో గల సుభాషితాలన్నా చాలా ఇష్టం.

"నచోరహార్యం, న చ రాజ హార్యం
నభ్రాతృభాజ్యం, న చ భారకారీ
వ్యయే కృతే వర్థత ఏవ నిత్యం
విద్యా ధనం సర్వధన ప్రధానమ్॥"

చదువుతూ చదువుతూ ఎప్పుడు పడుకున్నాడో రవికే తెలియదు. పొద్దున్న తల్లి వచ్చి లేపితేనే లేచాడు.

"రవీ! లేనాన్నా! ఏ డయింది. అన్నీ బాగా చూసుకున్నావా?" లేపుతూ అడిగింది తల్లి. "ఇవాళ సంస్కృతం కదూ?"

"అవునమ్మా."

"ఏదీ? ఏ దయినా ఒక శ్లోకానికి అర్థం చెప్పు" అడిగింది ఆమె

"నచోర హార్యం అనగా చోరులు హరించ లేనిదీ, నచ రాజ హార్యం అనగా రాజులు అపహరించ లేనిది. న భ్రాతృభాజ్యం అనగా అన్నదమ్ముల మధ్య పంపకాలు లేనిదీ, నచ భారకారీ అనగా ఏ మాత్రమూ భారం కలిగించనిదీ, వ్యయేకృతే వర్థత ఏవనిత్యం అనగా వ్యయ పరుస్తున్న కొద్దీ నిత్యమూ ప్రవర్థమాన మయ్యేదీ అయిన విద్యా ధనం సర్వధనాల్లోకీ ప్రధానమైన ధనం అని అర్థం" చెప్పాడు రవి.

"శభాష్ రవీ! బాగా చెప్పావు. ఇక ఈ పరీక్ష గురించిన భయం అక్కర్లేదు, లే, లేచి పనులు పూర్తి చేసుకో."

రవికి మొదటి నించీ భయం లేదు పరీక్షలంటే, ఎప్పుడూ శ్రద్ధగా చదివే వాడు. తెలివి, శ్రమించి చదివే గుణం రెండూ కల రవికి పరీక్షలంటే బెరుకు లేదు. కాని ఏ నాడూ పరీక్షలు రాయకపోవడం చేత కొంచెం జంకుగా ఉంది. వాళ్ళ స్కూల్లో పెట్టే పరీక్షలు పేరుకే కానీ పేపర్లు దిద్దరు. మార్కులు ఇవ్వరు. ఆ పేపర్లు పెట్టి టీచర్లు ముంత కింద పప్పు కొనుక్కుంటారని పిల్లలు నవ్వుకుంటూ అనుకుంటారు కూడా. కానీ టెన్త్ వచ్చే సరికి పిల్లలకీ, టీచర్లకీ అందరికీ కంగారే. అందరినీ ఎలాగోలా చదివించేయాలని టీచర్లు, ఎలాగో ఒకలా పాసై పోవాలని స్టూడెంట్లు, ఇదీ తంతు.

రవి త్వరగా భోజనం ముగించి తల్లి బెస్ట్ విషెస్ అందుకొని సెంటర్‌కి బయలుదేరాడు. అప్పటికే చాలా మంది అక్కడ చేరి ఉన్నారు. పెద్ద పెద్ద వాళ్ళు కూడా ఉన్నారు. అందరి ముఖాల్లో టెన్షన్, భయం. పేపర్ ఎలా ఉంటుందోనన్న ఆత్రత కనిపిస్తున్నాయి. రవి

తోటివాడే శేఖర్. శేఖర్‌దీ ఆప్షన్ సంస్కృతమే. శేఖర్ రవి అంత ఇంటలిజెంట్ కాదు. అసలు కష్టపడడు. కాని సంస్కృతం తీసుకుంటే తేలిగ్గా మార్కులొస్తాయని ఎవరో చెప్పారట. అందుకని తీసుకున్నా నంటాడు.

ఇక శేఖర్ తండ్రి. ఆయన ఆ పంచాయతీలో బాగా పలుకుబడి ఉన్న వ్యక్తి. కొడుకు సత్తా తెలుసు. అందుకే తన జాగ్రత్తల్లో తనున్నాడు. రవి పక్కనే శేఖర్ సీట్ ఏర్పాటు చేయించాడు. ఇన్విజిలేటర్ ఎవరు రాబోతున్నారో తెలుసుకొని, అతనితో అన్ని విషయాలూ చర్చించాడు. శేఖర్‌కి కూడా అన్ని సూచనల్లూ ముందుగానే వచ్చాయి.

రవిని చూడగానే శేఖర్ ఆనందంగా "రవీ!" అంటూ ముందు కొచ్చేశాడు.

"హలో శేఖర్. బాగా ప్రిపేర్ అయావా?" అడిగాడు రవి.

"రవీ! ఇవాళ మనిద్దరి సీట్లూ పక్క పక్కనే" అన్నాడు శేఖర్.

"ఎలా? ఇద్దరి నేంబర్లూ చాలా తేడా ఉన్నాయి కదా" ఆశ్చర్యం ప్రకటించాడు రవి.

"ఏముందీ? నువ్వు సంస్కృతంలో బెస్టని నేను మా నాన్నకి చెప్పాను. మా నాన్న నాకు నీ పక్కన కూర్చోమని చెప్పాడు."

"బాగుంది. ఇన్విజిలేటర్లు కూర్చోనివ్వద్దూ?" సందేహం రవికి.

"ఆ ఇన్విలిజిలేటర్ నిన్ననే మా ఇంటికి వచ్చి మా నాన్నకి మీ అబ్బాయి గురించి బెంగ పెట్టుకోకండి అన్నీ నేను చూస్తాను అన్నాడు. సరేనా? అంతే కాదు. మా నాన్నంటే మన సెంటర్ ఇన్‌ఛార్జికి కూడా హడలే. ఆయనకీ ఉద్యోగం వేయించింది మా నాన్నే!"

"అలాగా! అయినా నా పక్కన కూర్చుంటే నీ కేమిటి లాభం?" అడిగాడు రవి అర్థం కాక.

"పిచ్చి రవీ! నువ్వు ఒక్కో షీట్ పూర్తి చేసి నా కిస్తూ ఉండు. నేను వాటిని కాపీ చేసి తిరిగిచ్చేస్తూ ఉంటా! సరేనా?"

"నో! నే నివ్వను. పట్టుబడితే డిబార్ అవుతాం. ఇక్కడ కాకపోయినా రిజల్ట్ అయినా విత్‌హెల్డ్ అవుతుంది. నాకు ఇష్టం లేదు. కావాలంటే కొన్ని ఇంపార్టెంట్ ప్రశ్నలు, శ్లోకాలు చెప్తాను. ఇప్పుడైనా చదువుకో" అన్నాడు రవి.

"వీల్లేదు రవీ! ఇక టైమ్ లేదు. నువ్వు నాకు నీ పేపర్లు ఇవ్వాల్సిందే" గట్టిగా అడిగాడు శేఖర్.

"నే నివ్వను. తరువాత ఇబ్బందులు నేను పడలేను" వెంటనే లోపలికి వెళ్ళిపోయాడు రవి శేఖర్‌ని మరేం మాట్లాడ నివ్వకుండా.

"ఎక్కడికి పోతావురా?" అనుకున్న శేఖర్ ఇన్విజిలేటర్‌ని కలుసుకోవటానికి వెళ్ళాడు.

హాల్లో అందరికీ ముందే ఆన్సర్ షీట్స్ ఇచ్చి నంబర్స్ వేయమన్నారు. తరువాత బెల్‌కి క్వెశ్చన్ పేపర్స్ ఇచ్చారు. రవి పేపర్ తీసుకుని చదవటం మొదలు పెట్టాడు.

రవి లాంటి వాళ్ళకి ఆనందం. శేఖర్ లాంటి వాళ్ళకి అయోమయం. రవి రాత్రి చదివిన శ్లోకాలన్నీ వచ్చాయి. చాలా సంతోషంగా రాయడం ప్రారంభించాడు రవి.

శేఖర్ అసలేమీ రాయడం లేదు. రవినే చూస్తూ కూర్చున్నాడు, ఏమైనా వస్తే కదా రాయడానికి! అన్నీ క్షుణ్ణంగా నేర్చుకున్న రవికి పేపర్ పూర్తి చేయడానికి తక్కువ టైమే సరిపోయింది. ఇంకా గంటముందరే పేపర్ రాయడం పూర్తయింది.

కాని రవికి వచ్చేటప్పుడే అమ్మ చెప్పింది. "బాబూ! పరీక్ష రాయడం ముందరే అయిపోతే పేపర్ ఇచ్చేయొద్దు. ఇంకో సారి మళ్ళీ చూసుకొని ఛాయిస్‌లో వదిలేసినవి కూడా రాయి" అని. ఇప్పుడు అదే చేద్దామని మొదలు పెట్టబోయాడు రవి.

ఇంతలో ఇన్విజిలేటర్ వచ్చి "ఏం బాబూ! బాగా రాశావా?"

"అవును సర్."

"అయిపోయిందా అప్పుడే?"

"అవును సర్. అందుకని ఛాయిస్‌లో వదిలినవి రాస్తున్నాను సర్" అన్నాడు రవి.

"వీల్లే దబ్బాయి. అయిపోయాక ఇక హాల్లో ఉండకూడదు. పేపర్ ఇచ్చేసి వెంటనే వెళ్ళిపోవాలి. ఊ! లే!" అంటూ ఊదర గొట్టేసి పేపర్‌లాగేసుకున్నాడు.

"నేను నిశ్శబ్దంగా రాసుకుంటాను సర్!" రవి ఎంతో రిక్వెస్టింగ్‌గా అడిగాడు.

ఒప్పుకోలేదు అతను. చేసేది లేక బయటికి వచ్చేశాడు. అప్పుడు గుర్తు వచ్చింది రవికి తను పెన్, బాక్స్ రూమ్‌లోనే వదిలేసిన సంగతి. తిరిగి లోనికి వచ్చాడు రవి.

లోపల ఇన్విజిలేటర్ తన పేపర్లని శేఖర్ కిస్తూ అంటున్నాడు "కానీ శేఖర్! గబా గబా కాపీ చేయి. టైమ్ గంటే ఉంది." శేఖర్ వాటిని కాపీ చేయడం అప్పుడే మొదలు పెట్టాడు.

అంత చూస్తూన్న రవికి తాను రాత్రి చదివిన "గురుర్బ్రహ్మ" గుర్తికి వచ్చింది. "న చోర హార్యం..." వెక్కిరించింది. ★

## భద్రమేలెండి

బస్సులో కూర్చున్న సుబ్బారావు తలపైన ఉండే లగేజీ ర్యాక్‌లో ఓ పెద్ద సూట్‌కే సుంచా డో పెద్దమనిషి. అది చాలా పెద్దగా ఉండటంవల్ల సగం బయటికే ఉండి ఏ క్షణాన్నైనా సుబ్బారావు నెత్తిన పడేలా ఉంది.

"అది భద్రమే నంటారా?" అడిగా డాయన్ని సుబ్బారావు.

"ఓ భేషుగ్గా! తాళం వేశాను కదా! భద్రమే."

-రాయపెద్ది వివేకానంద్
[ఆదోని]



